క్లుప్తంగా

రాత్రి వేళల్లో పోలీసుల గస్తీ పెంచాలని వినతి



సీఐకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని టూటౌన్ ప్రాంతంలో దొంగల బెడద పెరిగిందని, రాత్రి వేళల్లో పోలీసుల గస్తీ పెంచాలని కోరుతూ బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నల్లగొండ టూటౌన్ సీఐకి వినతిపత్రం అందజేశారు. టూటౌన్ శివారు ప్రాంత కాలనీలైన శ్రీనగర్‌కాలనీ, న్యూ ఎన్జీఓస్‌కాలనీ, గొల్లగూడ, పెద్దబండ, రైల్వేస్టేషన్, శ్రీరాంనగర్ కాలనీ, హైదరాబాద్ రోడ్ పలు కాలనీల్లో దొంగల బెడద ఉందని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీజేపీ నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, జగ్జీవన్‌రామ్, గుండా నవీన్ రెడ్డి, వన్‌టౌన్, టూటౌన్ అధ్యక్షుడు గడ్డం మహేష్, వెంకటేష్, కిషన్, శ్యామ్ ఉన్నారు.

క్రీడాకారులకు స్నాక్స్ అందజేత



క్రీడాకారులకు స్నాక్స్ అందజేస్తున్న నరేష్

చిట్యాల : మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో జిల్లా క్రీడా యువజన శాఖ అధ్వర్యంలో ఈ నెల 1నుంచి వేసవి హాకీ ఉచిత శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణలో పాల్గొన్న 30మందికి పైగా క్రీడాకారులకు సీనియర్ హాకీ క్రీడాకారుడు బండ్ల నరేష్ మంగళవారం ఉదయం స్నాక్స్‌గా అరటిపండ్లు, బిస్కెట్స్, మినరల్ వాటిల్ బాటిల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో హాకీ కోచ్ గంగాపురం రాము, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు అభివృద్ధికి వ్యతిరేకం కాదు

నల్లగొండ: ఉద్యోగులు తెలంగాణ అభివృద్ధికి వ్యతిరేకం కాదని, ఉద్యోగుల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు గర్హనీయమని డీటీఎఫ్ అధ్యక్షుడు బి.వెంకటేశం, ప్రధాన కార్యదర్శి వెంకులు మంగళవారం ఖండించారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగులు బోనస్ ఇవ్వాలని ఉద్యమాలు చేస్తున్నారని, ప్రజలను, సమాజాన్ని తప్పుదోవ పట్టించే విధంగా సీఎం అసత్యం మాట్లాడడం సరికాదన్నారు. ఉద్యోగులకు రావాల్సిన హక్కుల కోసం నిరంతరం డీటీఎఫ్ పోరాడుతుందన్నారు.

విద్యార్థినులకు సన్మానం

నల్లగొండ : పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చూపారు. మంగళవారం ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్ వారిని సన్మానించి మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలను అవసరమైన సదుపాయాలను సమకూర్చుతామని తెలి పారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సుధారాణి, డీఐఈఓ దస్రునా యక్, అధ్యాపకులు శ్రీనివాస్, గోవర్ధన్ ఉన్నారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

చిట్యాల : మండల పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం మిస్సింగ్ కేసు నమోదైంది. ఎస్‌ఐ ధర్మ తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని చంద్రపురికాలనీకి చెందిన 52సంవత్సరాల వయస్సు గల షేక్ మెహబూబి ఈ నెల 4న రాత్రి ఇంట్లో నుంచి వెళ్లింది. ఆమె కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నట్లు, కుటుంబ సభ్యులు తమ బంధువులను విచారించినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. దీంతో మెహబూబి భర్త షేక్ కరీముల్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థినిని అభినందించిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



సాయిశ్రీవర్షిత్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

మునుగోడు : ఇటీవల వెలువడిన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో పట్టణానికి చెందిన దుబ్బ భాస్కర్, రాధల కుమారుడు సాయిశ్రీవర్షిత్ ఎంఎల్‌టీలో రాష్ట్రస్థాయి రెండో ర్యాంకు సాధించారు. మంగళవారం స్థానికంగా ఆ విద్యార్థిని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అభినందించారు. విద్యార్థి ఉన్నత చదువులకు అవసరమైన సహాయ, సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు.

లారీ యజమానుల నిరసన

మునుగోడు : కొనుగోలు కేంద్రాల నుంచి తీసుకొచ్చిన ధాన్యాని వెంటనే దిగుమతి చేసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల లారీ యజమానులు స్థానిక రైస్ మిల్లుల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ధాన్యంతో మిల్లుల వద్దకు వస్తే నాల్గు, ఐదు రోజులకు దిగుమతి చేస్తుండడంతో లారీ టైర్లపై బరువుపడి తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఎన్.నరేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఉన్నారు.

సర్కార్ బడుల్లో సకల వసతులు

- కార్పొరేట్‌ను తలపిస్తున్న ప్రభుత్వ పాఠశాలలు
- ఉత్తమ ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య
- పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



బడిబాట కార్యక్రమంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పర్వతగిరి హెచ్‌ఎం విజయ్‌ప్రసాద్

కనగల్ : కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించారు. పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల వసతులు కల్పిస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆలోచించి ప్రభుత్వ పాఠశాలల్లో చదివించేందుకు మొగ్గుచూపాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. తద్వారా తల్లిదండ్రులపై చాలా వరకు ఆర్థిక భారం తగ్గుతుంది. దీనికి తోడు ప్రభుత్వం ఉచితంగా ఏకరూప దుస్తువుల పంపిణీతో పాటు సన్నబియ్యంతో కూడిన భోజనం, పాఠ్యపుస్తకాలు, వారానికి 3సార్లు గుడ్లు, 3సార్లు రాగిజావ, గ్రంథాలయం వంటి సౌకర్యాలతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన కల్పించనున్నారు. ఈ ఏడాది మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సత్తాచాటి మంచి ఫలితాలు రాబాట్టారు. ఇప్పటికే గతంలో ఎప్పుడు లేని విధంగా పాఠశాలలు ముగిసిన తర్వాత ముందస్తుగా ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు.

పదిలో ఉత్తీర్ణత శాతం..

పది ఫలితాల్లో మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఈ సారి ప్రతిభ కనబర్చారు. మండల వ్యాప్తంగా 338మంది విద్యార్థులు పది పరీక్షలు రాయగా 321మంది ఉత్తీర్ణత (95శాతం) సాధించి సత్తాచాటారు. చినమాదారం ఉన్నత పాఠశాలలో 59విద్యార్థులు పరీక్ష రాయగా 59మంది(వందశాతం) ఉత్తీర్ణత, చర్లగౌరారం 11మంది విద్యార్థులకు గాను 9మంది (85శాతం), కనగల్ 44మందికి 41మంది (93.18శాతం), దోరెపల్లి 11మందికి 11మంది (వందశాతం), జి యడవల్లి 15మందికి 15మంది (వందశాతం), కురంపల్లి 15మందికి 12 (80శాతం), రేగట్టే 21మందికి 21మంది (వంద శాతం), కేజీబీవీ 43మంది విద్యార్థినులకు గాను 41 (95శాతం), కనగల్ ఆదర్శ పాఠశాల 97మందికి 91 (94శాతం), ఏకశిల 13మందికి 13మంది వంద శాతం ఉత్తీర్ణత సాధించారు.

కురంపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన పులకరం శ్రీకాంత్ 600మార్కులకు గాను 583సాధించి మండల టాపర్‌గా నిలిచాడు.

విద్యార్థుల తల్లిదండ్రులు ఆలోచించాలి



తల్లిదండ్రులు ఆలోచించి తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపి ఆర్థికంగా నష్టపోకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి. పాఠశాలల్లో అన్ని వసతులతో కూడిన విద్య అందుతుంది. ఇప్పటికే ముందస్తు బడిబాట కార్యక్రమం ద్వారా గ్రామంలోని ప్రతి ఒక్కరిని కలిసి అవగాహన కల్పించాం. ప్రభుత్వ పాఠశాలలు కూడా మెరుగయ్యాయి. ప్రభుత్వం నిర్ణయంతో ముందస్తుగా ఈ సారి బడిబాట కార్యక్రమాన్ని చేపట్టాం.

– గాలి విజయ్‌ప్రసాద్, హెచ్‌ఎం, పర్వతగిరి

విద్యార్థులకు నాణ్యమైన విద్య



ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉండడంతో విద్యార్థులు మంచి మార్కులు సాధించే అవకాశం ఉంటుంది. ఈ ప్రభుత్వ పాఠశాలల్లో సారి పది ఫలితాలు మరింత ఆశాజనకంగా వచ్చాయి. చాలా సంతోషంగా ఉంది. కార్పొరేట్ పాఠశాలల మాయలో తల్లిదండ్రులు పడొద్దు.

– పద్మ, ఎంఈఓ, కనగల్

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే వేముల వీరేశం



నకిరేకల్ : చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

నకిరేకల్ : నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకుసాగుతున్నామని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మంగళవారం పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో నకిరేకల్, కట్టంగూర్, చిట్యాల, నార్కట్‌పల్లి మండలాలకు సంబంధించిన 300మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన అందజేసి మాట్లాడారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసేవకుడిగా నిలబడతానని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు నియోజకవర్గానికి 3500 మంజురయ్యాయన్నారు. అర్హత కలిగిన వారికే ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. గత పాలకులు గడిచిన 10ఏళ్లలో ఎనిమిది లక్షల కోట్ల అప్పుల చేశారని, నేడు రాష్ట్రంలో ఉన్న ఆర్థిక పరిస్థితుల్లో రేవంతర్‌రెడ్డి తప్ప ఎవరు ఈ రాష్ట్రాన్ని నడపలేరని అన్నారు. గతంలో కల్యాణలక్ష్మికి దరఖాస్తు చేసుకోవాలంటే నాయకులు చుట్టూ తిరగాల్సి ఉండేదని, నేటి ప్రజాపాలనలో ఆ అవసరం లేదన్నారు. కార్యక్రమంలో బీసీ ఫైనాన్స్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య, నకిరేకల్, చిట్యాల మార్కెట్ కమిటీల చైర్‌పర్సన్లు గుత్తా మంజుల, నర్రా వినోద, స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితా శ్రీనివాస్‌గౌడ్, ఆయా మండలాల తహసీల్దార్ జమురుద్దీన్, ప్రసాద్‌నాయక్, పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నార్కట్‌పల్లి : మండలంలో 59మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంగళవారం నకిరేకల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వేముల వీరేశం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ తరుణ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, సట్టు సత్తయ్య, దూదిమెట్ల సత్తయ్య, జేరిపోతుల భరత్, నేతగాని కృష్ణ, గాయం శ్యాం సుందర్‌రెడ్డి, గడ్డం పశుపతి, గోసుల భద్రాచలం, మురళి, రాజు, శశిధర్‌రెడ్డి, రమేష్ ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

నల్లగొండ టౌన్ : పట్టణానికి చెందిన అయితరాజు రవి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంగళవారం అతడికి ఏపీ మాజీ సీఎం జగన్ వీరాభిమాని దైద కృష్ణారెడ్డి మంగళవారం రూ.3వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడి కుటుంబ సభ్యులు కృష్ణారెడ్డికి, అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులకు, చాకలి ఐలమ్మ సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యాదగిరిగౌడ్, ఐతరాజు లక్ష్మణ్, యలిజాల శంకర్, అయితరాజు ప్రసాద్, అశోక్ పాల్గొన్నారు.

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

నల్లగొండ టౌన్: రాష్ట్రంలో అకాల వర్షాల వలన పంట నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఎమ్మెల్సీ నెలికంటి సత్యం కోరారు. నల్లగొండలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన నల్లగొండ పట్టణ, మండల 15వ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని అధికారులకు సూచించారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్నిరకాల ధరలు పెంచుతూ కార్పొరేట్ శక్తులకు, పెట్టుబడిదారులకు రాయితీలు కల్పిస్తున్నారన్నారు. వివిధ దేశాల్లో చమురు ధరలు తగ్గుతున్నప్పటికీ భారతదేశంలో మాత్రం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వంతో శాంతి చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నామని మావోయిస్టులు ప్రకటిస్తే.. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చర్చలు జరిపేది లేదని, మావోయిస్టులను కాల్చి చంపుతామని మాట్లాడటం సరికాదన్నారు. అనంతరం సీపీఐ నాయకుడు మల్లేపల్లి ఆదిరెడ్డి మాట్లాడుతూ.. పేద ప్రజల కోసం నిరంతరం పాటుపడుతున్న సీపీఐ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి, కేఎస్ రెడ్డి, బలుగూరి నరసింహ, గాదపాక రమేష్, ముండ్ల ముత్యాలు, వి. లెనిన్, ఎస్‌కే మదార్, రేవెల్లి యాదయ్య, గుండె రవి, కోమటిరెడ్డి ప్రద్యుమ్నారెడ్డి, పుట్టల సుజాత, ఎం. కౌసల్య, విజయ పాల్గొన్నారు.

'భూ భారతి'పై అవగాహన అవసరం



రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడుతున్న ఆర్డీఓ అశోక్‌రెడ్డి

నకిరేకల్ : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న భూ భారతి చట్టంపై రైతులు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని నల్లగొండ ఆర్డీఓ యానాల అశోక్‌రెడ్డి అన్నారు. పైలెట్ ప్రాజెక్టులో ఎంపికైన మండలంలోని నెల్లిబండ, మండలాపురం గ్రామాల్లో మంగళవారం జరిగిన రెవెన్యూ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న భూముల సమస్యలను ఆ చట్టం ద్వారా పరిష్కారం పొందవచ్చన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్న ఈ సదస్సుల్లో రైతులు పాల్గొని సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. మండలాపురంలో 5, నెల్లిబండలో 4 చొప్పున రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో నకిరేకల్, కట్టంగూరు మండలాల తహసీల్దార్లు జమురుద్దీన్, ప్రసాద్ నాయక్, డీటీ రామకృష్ణ, ఆర్‌ఐలు బోళ్ల శ్యాంసుందర్, చిరంజీవి, సర్వేయర్లు, మధు, రజనీకాంత్, అరవింద్, రెవెన్యూ సిబ్బంది రాజు తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న డీఎస్పీ, దాత

నార్కట్‌పల్లి : వేసవిలో ఉచిత క్రీడా శిక్షణ శిబిరాన్ని యువకులు సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాణించాలని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. క్లీన్ హోమ్ గ్రీన్ హోమ్ ప్రోగ్రాం ఆర్గనైజర్ ఆదిమల్ల మణిరాజు ఆధ్వర్యంలో దాతల సహకారంతో మండలంలోని ఏపీ లింగోటం హైస్కూల్‌లో జూన్ 6వరకు నిర్వహించే ఈ శిబిరాన్ని మంగళవారం నల్లగొండ డీఎస్పీ కోలను శివరాంరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. యువత, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో నైపుణ్యత సాధించేందుకు ఈ శిబిరాలు దోహదపడతాయన్నారు. అనంతరం క్రీడా సామగ్రిని గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధి పోరెడ్డి నర్సింహారెడ్డి అందజేసినట్లు తెలి పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కాశయ్య, జయరాములు, సైదిరెడ్డి, ఆంజయ్య, భాస్కర్ ఉన్నారు.

ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ఠామహోత్సవాలు



విగ్రహాలకు జలాభిషేకం చేస్తున్న మహిళలు

నకిరేకల్ : మండలంలోని నోముల గ్రామంలో స్థానిక దాతల సహకారంతో రూ.50లక్షలతో నిర్మించిన శ్రీవిజయ కనక దుర్గాదేవి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. బ్రహ్మశ్రీ భోనగిరి గోపాలక్రిష్ణశర్మ ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకాలు, గ్రామ బలిహరణం, చండీహోమాలు నిర్వహించారు. గ్రామంలోని మహిళంతా జలబిందెలతో ప్రదర్శనగా వచ్చిన అమ్మవారి విగ్రహాలకు జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కోడదల భిక్షమయ్య, బాదిని వెంకటరమణ, కుంచం సోమయ్య, యాసా కరుణాకర్‌రెడ్డి, యల్మకంటి జానయ్య, మాచర్ల యాదగిరి, బాదిని రాము, కందికట్ల నర్సింహ, కోమరెడ్డి కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

సుంకెనపల్లిలో నీటి కష్టాలు.!

చిట్యాల : మండలంలోని సుంకెనపల్లి గ్రామంలో పలు వార్డుల్లో మంచినీటి సరఫరా కాక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని 8వవార్డులో ఆరు రోజులుగా మంచినీరు సరఫరా కావడం లేదు. దీంతో వార్డులోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆ వార్డు మహిళలు వాపోతున్నారు. దీంతో చేసేదిలేక ఆ వార్డు మహిళలంతా ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. వెంటనే తమ వార్డుకు మంచినీటి సరఫరాకు తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను, ప్రజాప్రతినిధులను కోరారు.

పంచాయతీ కార్యదర్శి వివరణ..

సుంకెనపల్లిలోని 8వవార్డులో నీటి సరఫరా అయ్యే పైపులైన్‌లో నాచు పెరుకుపోయి నీటి సరఫరా కావడం లేదు. వెంటనే తగిన చర్యలు తీసుకోని పైపులైన్‌కు మరమ్మతులు చేసి నీటి సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని కార్యదర్శి కె.అంజయ్య తెలిపారు.



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



నల్లగొండ టౌన్ : రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

నల్లగొండ టౌన్ : ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు నాగార్జున అన్నారు. మంగళవారం పట్టణంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో వివిధ సంఘాలతో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ 29కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందని విమర్శించారు. 8గంటలు పనిదినాన్ని 12గంటలకు పెంచిందన్నారు. కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, 8గంటల పనివిధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో దళితులు, గిరిజనులు, మహిళలపై, బలహీన వర్గాలపై జరుగుతున్న దాడులు ఆపాలన్నారు. పెరుగుతున్న ధరలు అరికట్టాలని, నిరుద్యోగులకు ఉపాధి ఇవ్వాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు ఎడ్ల సైదులు, వివిధ సంఘాల నాయకులు చిన్నపాక లక్ష్మీనారాయణ, సుధాకర్‌రెడ్డి, నారి ఐలయ్య, బకరం శ్రీనివాస్, వంటిపాక యాదగిరి, బండ శ్రీశైలం, వెంకులు, కట్టెల శివకుమార్, మానుపటి భిక్షం, అచ్చాలు, మల్లం మహేష్, అరుణకుమారి, అవుట రవీందర్, బొట్టు శివకుమార్, గాదె నర్సింహ, బొల్లు రవీందర్, బొజ్జ వెంకన్న పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై ప్రతిఘటిద్దాం

కేంద్రంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పెద్దఎత్తున పాల్గొని ప్రతిఘటించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, తెలంగాణ ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ధరలు, నిరుద్యోగం ఎన్నడూ లేనంతగా పెరిగి ప్రజల కొనుగోలు శక్తి తీవ్రంగా పడిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ యార్డ్ సెక్రటరీకి, ఎలక్ట్రిసిటీ స్టోర్ ఏడీకి, డీసీఎంఎస్ సీఈఓలకు సమ్మె నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అవుట రవీందర్, పల్లె నగేష్, కత్తుల యాదయ్య, రుద్రాక్ష శ్రీకాంత్, కొత్త రాజు, యాదగిరి రెడ్డి, వెంకన్న, సత్తయ్య, పరమేష్, రవి పాల్గొన్నారు.



చిట్యాల : సమావేశంలో మాట్లాడుతున్న అయిలయ్య

సమ్మెను విజయవంతం చేయాలి

చిట్యాల : ఉపాధిహామీ పథకం చట్టరక్షణకై ఈ నెల 20న దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి అయిలయ్య కోరారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన ఆ సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధిహామీ పనిదినాలను పెంచడంతో పాటు కనీస వేతనాన్ని రూ.600కు పెంచాలని డిమాండ్ చేశారు. సంఘం మండల కార్యదర్శి కల్లూరు కుమారస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చినవెంకులు, జిల్లా ఉపాధ్యక్షుడు కత్తుల లింగస్వామి, నాయకులు గుడిసె లక్ష్మీనారాయణ, కొండేటి రాములు, నకిరేకంటి రాములు, రెడపాక మలయ్య తదితరులు పాల్గొన్నారు.

చికాగో కార్మికుల పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి



చిట్యాల : జెండా ఎగురవేస్తున్న సురేష్‌కుమార్

కట్టంగూర్ : చికాగో కార్మికులు అందించిన పోరాట స్ఫూర్తితో కార్మికుల హక్కుల కోసం ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి బొమ్మిడి నాగేష్ పిలుపునిచ్చారు. మేడే వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని బొల్లేపల్లి గ్రామంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య జాతీయ కమిటీ పిలుపు మేరకు ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జెండాను ఎగురవేసి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పొట్టపల్లి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు జంజిరాల క్రాంతి, రుద్రాక్షి వెంకన్న, ఊట్కూరి సైదులు, మహేష్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

చిట్యాల : విద్యుత్ శాఖలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగుల, ఆర్టిజెన్స్, ప్రైవేటు బిల్‌కలెక్షన్ ఏజెంట్‌ల సమస్యల పరిష్కారానికి తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 327 యూనియన్ కృషి చేస్తుందని ఆ యూనియన్ రాష్ట్ర నాయకుడు ఎం.సురేష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన మే డే ఉత్సవాలలో పాల్గొని యూనియన్ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 327యూనియన్ బలోపేతానికి యూనియన్ సభ్యులు కృషి చేయాలన్నారు. అనంతరం యూనియన్ మండల అధ్యక్షుడిగా పగడాల వెంకటేష్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు అమర్‌కుమార్‌రెడ్డి, నల్లగొండ డివిజన్ అధ్యక్షుడు కోమటిరెడ్డి సమ్మిరెడ్డి, కార్యదర్శి పాండు, శంకరయ్య, రాజేశ్వరరావు, రామూర్తి, తిరుమలేష్, వెంకటేశ్వర్లు, నర్సింహ, శ్రీనివాస్‌లు, భిక్షం, వెంకన్న, సంజీవ, యోగానందం, సురేష్‌బాబు పాల్గొన్నారు.

కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం పాలకవర్గం ఎన్నిక



కొండ వెంకన్నగౌడ్, అధ్యక్షుడు



మల్లేబోయిన దశరథ, కార్యదర్శి



చౌగోని నాగయ్య, కోశాధికారి

నకిరేకల్ : నకిరేకల్ కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘం పాలకవర్గం కొలువుదీరింది. మంగళవారం ఎన్నికల అధికారి నాగేశ్వర రావు ఆధ్వర్యంలో అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి పదవులకు ఎన్నిక నిర్వహించారు. మొత్తం తొమ్మిది మంది డైరెక్టర్లు ఉన్నారు. ఒకే ప్యానల్ విజయం సాధించడంతో ఆ పదవులకు ఒకటి చొప్పున నామినేషన్ల రావడంతో ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి నాగేశ్వరరావు ప్రకటించారు. అధ్యక్షుడిగా కొండ వెంకన్నగౌడ్, ఉపాధ్యక్షుడిగా చౌగోని వెంకన్నగౌడ్, కార్యదర్శిగా మల్లేబోయిన దరశథ, కోశాధికారిగా చౌగోని నాగయ్యగౌడ్ ఎన్నికయ్యారు. ఈ పాలకవర్గం పదవీకాలం 2030 మే 5వతేదీ వరకు కొనసాగనుంది. కార్యక్రమంలో డైరెక్టర్లు తండు వెంకటేశ్వర్లు, కొండ శ్రీను, కొండ యాదమ్మ, తలారి వీరమ్మ, బొప్పని సైదులు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతోత్సవాలు

వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాల సందర్భంగా నల్లగొండ పట్టణంలోని బీట్ మార్కెట్‌లో వాసవీ ఉమామహేశ్వర స్వామి సహిత రామకోటి స్తూప దేవాలయంలో మంగళవారం భక్తులు 108 కళశాలతో అవాహన పూజలు, పారాయణం చేశారు.



ఈదురుగాలులు.. వడగండ్ల వాన

కనగల్ : మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని ఐకేపీ కేంద్రాల్లోకి వర్షం నీరు చేరడంతో ధాన్యం రాశులు తడిసిముద్దయ్యాయి. చెల్లాయిగూడెం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ అమర్చిన విద్యుత్ స్తంభం నేలకొరిగింది. పలుచోట్ల ఇండ్ల పైకప్పు రేకులు లేచి పడిపోయాయి. ఈదురుగాలుల బీభత్సంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

కట్టంగూర్ : మండలంలో సోమవారం రాత్రి తీవ్రమైన ఈదురు గాలులు వీశాయి. దీంతో మండలంలోని పలు గ్రామాల్లో మామిడికాయలు, నిమ్మకాయలు నేలరాయాయి.

మర్రిగూడ : మండలంలోని సరంపేట, శివన్నగూడ, రాంరెడ్డిపల్లి, మర్రిగూడ గ్రామాల్లో మంగళవారం ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లోని నిమ్మ, మామిడితోటలో పిందెలు రాలాయి. సరంపేటలో రోడ్డుపక్కన చెట్లు విరిగాయి. ఈదురుగాలులు, అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



కనగల్ ఐకేపీ కేంద్రంలో చేరిన వర్షం నీరు

పేద విద్యార్థులకు ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ కోచింగ్



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

రామగిరి(నల్లగొండ) : నిరుపేద విద్యార్థులకు 10సంవత్సరాలుగా ఉచితంగా స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ ఇస్తున్నట్లు మెరిడియన్ స్కూల్ డైరెక్టర్ పాముల అశోక్ తెలిపారు. పాలిసెట్, టీఎస్‌ఆర్‌జేసీ ఎంట్రెన్స్ విద్యార్థులకు ఉచిత శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమాన్ని స్థానిక స్కూల్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం అంబటి శ్రీనివాస్‌ను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఏఎస్ఎస్ ఇనిస్టిట్యూషన్ ద్వారా పేద, అనాథలకు ఉచితంగా స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ఈ నెల 8న విద్యార్థులకు సగం ఫీజుతో కోచింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్.వెంకటరెడ్డి, ఎస్.రవీందర్‌రెడ్డి, అరుణ, శ్రీదేవి పాల్గొన్నారు.